
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.2 । కనిష్ఠం 19.5
కామారెడ్డి
జిల్లా వార్తలు
5
బుధవారం 30 అక్టోబరు 2024



డెయిరీ కళాశాల అసోసియేట్ డీన్‌గా ఉమాపతి

కామారెడ్డి టౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి డెయిరీ టెక్నాలజీ కళాశాల అసోసియేట్ డీన్‌గా ఉమాపతి నియమించబడ్డారు. ఇప్పటి వరకు పని చేసిన అసోసియేట్ డీన్ డాక్టర్ శరత్‌చంద్ర పీవీ నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్‌గా నియమించబడ్డారు. రెండు సంవత్సరాల ఐదు నెలలు ఇక్కడ సేవలందించిన శరత్‌చంద్ర రిజిస్ట్రార్‌గా నియమించడంపై కళాశాల సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు. విద్యా ప్రమాణాలను పెంచడానికి ఎంతగానో కృషి చేశారని కళాశాల ఉత్తీర్ణత చెందిన విద్యార్థులందరికీ నూరు శాతం ఉద్యోగాలు కల్పించడానికి ప్రయత్నించారని తెలిపారు.

ఇక అంతా ఆన్‌లైన్‌లోనే..!

- ట్రేడ్ లైసెన్స్‌కు ఆన్‌లైన్ విధానం
- కంప్యూటరీకరణ చేస్తున్న యంత్రాంగం
- చేయకుంటే భారీ జరిమానాలు



ఆన్‌లైన్ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఎల్లారెడ్డి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో వ్యాపార నిర్వహణకు ట్రేడ్ లైసెన్స్‌లు తప్పనిసరిగా దుకాణాలకు వెళ్లి రసీదులు ఇచ్చి పన్ను వసూలు చేసే పద్ధతి ఇప్పటి వరకు ఉండగా, కమిషనర్ అండ్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) తాజా ఉత్తర్వులతో ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ట్రేడ్ లైసెన్స్‌ల జారీలో పారదర్శకత్వం పెంచేందుకు ఈ విధానం అమలు చేస్తోంది.

ఆన్‌లైన్ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ మున్సిపాలిటీల్లో ట్రేడ్ లైసెన్స్‌ల కంప్యూటరీకరణ విధానాన్ని చేపట్టారు. ఈ పట్టణాల్లో సుమారు రెండు వేలకుపైగా ట్రేడ్ లైసెన్స్‌లు ఉన్నాయి. ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో 262 ట్రేడ్ లైసెన్స్‌లు ఉండగా ఏటా వీటి ద్వారా 3.5 లక్షల వరకు పనుల రూపంలో ఆదాయం లభిస్తుంది. ఈ లైసెన్స్‌లను తీసుకునేందుకు సంవత్సరానికి సంబంధించిన ఫీజును ముందస్తుగానే చెల్లించాల్సి ఉంటుంది. లైసెన్స్ తీసుకోకుంటే అర్ధవార్షిక సంవత్సరం లోపలో అయితే 25 శాతం అదనంగా ఆ తరువాత అయితే 50శాతం అదనంగా చెల్లించాల్సి ఉంటుందని ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ నేపథ్యంలో మున్సిపాలిటీల్లో రెవెన్యూ యంత్రాంగం ట్రేడ్ లైసెన్స్‌లను ఆన్‌లైన్ చేయడంలో నిమగ్నమయ్యారు.

ఆన్‌లైన్ చేయకుంటే జరిమానా

- శ్రీహరి రాజు, మున్సిపల్ కమిషనర్, ఎల్లారెడ్డి

ప్రతీ దుకాణదారుడు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలి. వీటిని ఆన్‌లైన్ చేయటం తప్పనిసరి. లేనట్లయి తే భారీ జరిమానాలు విధిస్తాం. అంతేకాకుండా దుకాణాలను సీజ్ చేయడంతో పాటు జప్తు చేసే విధంగా ట్రేడ్ లైసెన్స్ యాక్ట ప్రభుత్వం అమలు చేస్తోంది.

సోయా దళారుల పాలు



మద్నూర్ మార్కెట్ యార్డులో సోయాను ఆరబోసిన రైతులు

- రైతులను దగా చేస్తున్న ప్రైవేట్ వ్యాపారులు
- మరోవైపు కొనుగోలు కేంద్రంలో నిబంధనల కొర్రీ
- తేమ శాతం లేకపోవడంతో కొనుగోలు చేయని మార్క్‌ఫెడ్
- ఇదే అదునుగా భావించి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్న ప్రైవేట్ డీలర్లు
- పట్టించుకోని రైతు ప్రజాప్రతినిధులు.. నష్టపోతున్న సోయా రైతులు
- సోయా కొనుగోళ్లలో నిబంధనలను సడలించాలని రైతుల డిమాండ్
- జిల్లా వ్యాప్తంగా 81వేల మెట్రిక్ టన్నులలో సోయా దిగుబడులు

కామారెడ్డి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఈ సీజన్‌లో జిల్లాలో రైతులు విస్తారంగా సోయా పంటను సాగు చేయడం, మంచి దిగుబడులు వస్తుండడంతో గిట్టుబాటు అవుతుందని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేశారు. కానీ పంటను మార్కెట్‌లోకి తీసుకువచ్చేసరికి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సవాలక్ష నిబంధనలు ఉండడంతో పంటను అమ్ముకునేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా తేమ శాతం రావడం లేదని కొనుగోలు కేంద్రాల్లో కాంటా జరగడం లేదు. ఇదే అదనుగా భావిస్తున్న ప్రైవేట్ డీలర్లు, దళారులు మద్దతు ధర కంటే తక్కువకు కొనుగోలు చేస్తుండడంతో రైతులు నష్టపోతున్నారు. దళారులు చెప్పిందే శాసనం అన్నట్లు రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. మరోవైపు కొనుగోలు కేంద్రాల వద్ద రోజుల తరబడి సోయా పంటను ఆరబెట్టలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తేమ శాతం, ఇతర నిబంధనలను సడలించి మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

81,915 మెట్రిక్ టన్నులలో దిగుబడులు

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాల పరిధిలో వేల ఎకరాల్లోనే సోయా పంట సాగైంది. ఈ సీజన్‌లో రైతులు పత్తి, మొక్కజొన్న పంటల నుంచి సోయా వైపు మళ్లారు. ప్రధానంగా జుక్కల్, బిచ్కుంద, మద్నూర్, పెద్దకొడప్‌గల్, తాడ్వాయి, రాజంపేట, సదాశివనగర్, గాంధారి తదితర మండలాల్లో వేల ఎకరాల్లో రైతులు సోయా పంటను సాగు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఈ వర్షాకాలం సీజన్‌లో 94వేల ఎకరాలకు పైగా సోయా పంట సాగైంది. వర్షాలు సమృద్ధిగా కురువడంతో సోయా పంట బాగానే ఉందని దిగుబడులు సైతం ఎక్కువగానే వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. 81,915 మెట్రిక్ టన్నుల్లో సోయా దిగుబడులు వస్తాయని అధికారులు అంచనా వేశారు. ఎకరాన 7 నుంచి 8 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు, రైతులు చెబుతున్నారు.

7 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో సోయా కొనుగోళ్లను చేపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 7 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే మద్నూర్ మార్కెట్ యార్డ్‌లో కొనుగోలు కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు ప్రారంభించారు. మద్నూర్‌తో పాటు బిచ్కుంద, పిట్లం, జుక్కల్ ప్రాంతాల్లోనూ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ.4,892 ఉంది. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో 12వేల మెట్రిక్ టన్నుల సోయా కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే రైతులు పంటను నూర్పిడి చేసి సోయాను మార్కెట్‌కు తరలిస్తున్నారు.

తేమ శాతం రాక రైతుల తంటాలు

జిల్లాలో సోయా వేల ఎకరాల్లోనే సాగు చేశారు. ఇప్పటికే పంటను కోసి రైతులు నూర్పిడి చేస్తూ ఉత్పత్తులను మార్కెట్‌కు తరలిస్తున్నారు. సోయా కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై 20 రోజులు గడుస్తున్నా కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. రైతులు కొనుగోలు కేంద్రాలు, మార్కెట్ యార్డులకు సోయాను పెద్దమొత్తంలో తరలించారు. కేంద్రాల్లో కుప్పలు తెప్పలుగా సోయా ఉంది. అయితే తేమ శాతం రావడం లేదని నిబంధనలతో కొనుగోలు చేయడం లేదని రైతులు చెబుతున్నారు. దీంతో కొనుగోలు కేంద్రాల్లోనే సోయాను ఆర బెట్టేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. మరికొందరు రైతులు దళారులను ప్రైవేట్ డీలర్లను ఆశ్రయిస్తున్నారు. సోయా తేమ శాతం లేదనే కారణంతో దళారులు మద్దతు ధరకంటే తక్కువగా కొనుగోలు చేస్తున్నారు. రూ.500లకు తక్కువ చేసి క్వింటాల్‌కు రూ.4300లు మాత్రమే దళారులు చెల్లిస్తున్నారని రైతులు చెబుతున్నారు. దీంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనల కొర్రీలు

ఈ వర్షాకాలం సీజన్‌లో చాలా మంది

(మిగతా 8వ పేజీలో)

తేమ శాతం లేక అధికారులు కొనుగోలు చేయడం లేదు

- గణేష్, సోయా రైతు, మద్నూర్



మద్నూర్ మార్కెట్ యార్డులోకి 15 రోజుల కిందట సోయా పంటను తీసుకువచ్చాను. కొనుగోలు కేంద్రం వద్ద సోయా తేమ శాతం రావడం లేదని అధికారులు కొనుగోలు చేయడం లేదు. దీంతో 15 రోజులుగా కుటుంబం మొత్తం కలిసి మార్కెట్ యార్డులోనే సోయాలను ఎండబోయాల్సిన పరిస్థితి వస్తోంది. బయట మార్కెట్‌లో అమ్ముకుందామనుకుంటే ప్రైవేట్ వ్యక్తులు తక్కువ ధర చెబుతున్నారు. నష్టపోతామని వారికి అమ్మడం లేదు.

స్పెషల్ సమ్మరి రివిజన్ ఓటరు జాబితా విడుదల

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి టౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): స్పెషల్ సమ్మరి రివిజన్ 2025కు సంబంధించిన ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటించినట్లు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. మంగళవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఎస్ఆర్ ముసాయిదా ఓటరు జాబితా ప్రకటించడం జరిగిందని, జాబితాలో అభ్యంతరాలు, ఆక్షేపణలు ఉంటే 28 నవంబరు 2024లోగా సమర్పించవచ్చని తెలిపారు. నవంబరు 9,10 తేదీల్లో ప్రత్యేక క్యాంపేయిన్ ఏర్పాటు చేస్తామన్నారు. డిసెంబరు 24లోగా డిస్పోజల్ చేస్తామన్నారు. జనవరి 6, 2025న ఫైనల్ పబ్లికేషన్‌ను ప్రకటిస్తామన్నారు. జనవరి 1, 2025 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరి పేరు ఓటరుగా నమోదు చేయవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీవో రంగనాథ్ రావు, తహసీల్దార్ జనార్ధన్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

వరి ధాన్యం కేంద్రాల్లో కొనుగోళ్లు వేగవంతం చేయాలి

జిల్లాలో వరి ధాన్యం కేంద్రాల్లో కొనుగోళ్లు వేగవంతం చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో పౌర సరఫరాల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని, ప్రతీ మండల, డివిజన్ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రతీ రైస్‌మిల్లుకు ఒక ఏఈవోని అనుసంధానం చేయాలని తెలిపారు. మిల్లర్లతో సమావేశం ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఏర్పాట్లు చేపట్టాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వి.విక్టర్, సివిల్ సప్లయ్ డీఎం రాజేందర్, సహాయ పౌర సరఫరాల అధికారి నరసింహారావు, జిల్లా మార్కెటింగ్ అధికారిణి రమ్య తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర ఇంటింటి సర్వేను పక్కాగా నిర్వహించాలి

సమగ్ర ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే కార్యక్రమాన్ని నిర్వహించుటకు ప్రతీ ఇంటింటి సర్వే చేపట్టాలని, ఏ ఒక్క ఇల్లు కూడా తప్పిపోకుండా సర్వే చేయాలని తెలిపారు. సర్వే కోసం ఎన్యూమరేటర్‌లను నియమించాలని వారికి శిక్షణ ఇవ్వాలని తెలిపారు. ఎన్యూమరేటర్‌లకు అపాయింట్‌మెంట్ ఉత్తర్వులు జారీ చేయాలని సూచించారు. ప్రభుత్వం జారీ చేసిన ప్రశ్నావళిలోని అన్ని అంశాలకు సంబంధించిన వివరాలు ఎన్యూమరేటర్లు సేకరించాలని తెలిపారు. ప్రతీ ఎన్యుమరేటర్‌కు అన్ని అంశాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. మండల ప్రత్యేకాధికారులు ఎన్యుమరేషన్‌పై పర్యవేక్షణ ఉంచాలని తెలిపారు. ఎన్యుమరేషన్‌కు అవసరమైన సామగ్రి సమకుర్చాలని తెలిపారు. మండల స్థాయిలో ఎన్యుమరేటర్లకు శిక్షణ నిర్వహించాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సీపీవో రాజారాం, డీపీవో శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నడకకు సైతం నరకమే..!



- రోడ్డు పాడై సంవత్సరాలు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు, నాయకులు
- నరకం చూస్తున్న ప్రయాణికులు
- పట్టించుకోని పాలకులు

7

ఇంటింటి కుటుంబ సర్వేను సమగ్రంగా నిర్వహించాలి

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

కామారెడ్డి టౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను సమగ్రంగా నిర్వహించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం ఆయా జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణ విధి విధానాలను క్యాబినెట్ సమావేశంలో చర్చించి ఆమోదించామని తెలిపారు. ఈ సర్వేలో ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాలను సేకరిస్తామని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఉన్నతమైన ఆలోచనలతో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేపడుతుందని, ఎస్సీ, ఎస్టీ ఇతర బలహీన వర్గాల అభ్యున్నతి కోసం వివిధ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ అవకాశాలను మెరుగుపరచడానికి తగిన ప్రణాళికలు తయారు చేసేందుకు ఈ సర్వే ఉపయోగిస్తామని అన్నారు. ప్రజాప్రభుత్వం చేపట్టే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే లక్షలాది మంది జీవితాల్లో మార్పు తీసుకుని వస్తుందని, అధికారులు వివరాలను సేకరించే క్రమంలో జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ప్రతీ ఇంటి నుంచి వివరాల సేకరణ జరగాలని, దానికి తగిన విధంగా ప్లాన్ తయారు కావాలని తెలిపారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణకు అవసరమైన ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్‌లను గుర్తించి వారికి అవసరమైన శిక్షణ అందించాలని, గ్రామ, మండల, జిల్లా స్థాయి ప్రభుత్వ అధికారులను ఎంపిక చేయాలని తెలిపారు. 150 కుటుంబాలకు ఒక ఎన్యుమరేటర్ ఉండేలా ఈబీ మ్యాప్‌లను అప్‌లోడ్ చేయాలని ఎన్యుమరేటర్‌కు నిర్దిష్టమైన ఎన్యుమరేషన్ బ్లాక్ కేటాయించాలని, 10 ఈబీ బ్లాక్‌లకు డేటా సేకరణ పర్యవేక్షణకు సూపర్‌వైజర్ ఉండాలని, సూపర్‌వైజర్ 10 శాతం ఇళ్లను ర్యాండమ్‌గా ఎంచుకుని డేటా వివరాలు తనిఖీ చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వర్‌రావు, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్‌లు శ్రీనివాస్‌రెడ్డి, వి.విక్టర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉత్తీర్ణత శాతం పెంచేందుకు కృషి!

- ప్రతీ విద్యార్థి కోసం ఉదయం, మధ్యాహ్నం వేళలో స్టడీ అవర్స్ ఏర్పాటు
- అధ్యాపకులు లేనిచోట పక్కనే ఉన్న కళాశాలల నుంచి అధ్యాపకులను సర్దుబాటు చేస్తున్నాం
- ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం



కామారెడ్డి టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు కృషి చేస్తున్నామని, వెనుకబడిన ప్రతీ విద్యార్థి కోసం ఉదయం, మధ్యాహ్నం వేళలో స్టడీ అవర్స్ ఏర్పాటు చేస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. పై అధికారులతో మాట్లాడి వారికి ఇబ్బందులు తొలిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నూతనంగా ఏర్పడిన కళాశాలలో అధ్యాపకులు లేకుంటే విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా పక్కన ఉన్న కళాశాలల నుంచి వారానికి రెండు రోజుల చొప్పున సబ్జెక్టులు బోధించేలా చర్యలు చేపట్టామని ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం 'ఆంధ్రజ్యోతి'కి మంగళవారం ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. జిల్లాలో ఇంటర్ కళాశాలపై ఆయన పలు అంశాలను వివరించారు.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో మొత్తం ఎన్ని కళాశాలలు ఉన్నాయి. అందులో ఎంత మంది విద్యార్థులు చదువుతున్నారు?

అధికారి: జిల్లాలో మొత్తం 85 కళాశాలలు ఉన్నాయి. ప్రభుత్వ కళాశాలలు 20, ప్రభుత్వేతర 47, ప్రైవేట్ కళాశాలలు 18 ఉన్నాయి. ఇందులో 18,609 మంది విద్యార్థులు ప్రస్తుతం చదువుతున్నారు. మొదటి సంవత్సరంలో ప్రభుత్వ కళాశాలలో 2,554, ప్రభుత్వేతర కళాశాలలో 2038, ప్రైవేట్ కళాశాలలో 4545, ద్వితీయ సంవత్సరంలో ప్రభుత్వ కళాశాలలో 2395, ప్రభుత్వేతర కళాశాలలో 2685, ప్రైవేట్ కళాశాలలో 3792 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో ప్రభుత్వ కళాశాలల్లో ఎంత మంది సిబ్బంది పని చేస్తున్నారు? నూతన కళాశాలలు ఎన్ని ఏర్పాటయ్యాయి?

అధికారి: జిల్లాలో మొత్తం 250 వరకు సిబ్బంది ఆయా కళాశాలల్లో పని చేస్తున్నారు. అందులో రెగ్యులర్, గెస్ట్ అధ్యాపకులు 170 వరకు ఉండగా మిగిలిన వారు బోధనేతర సిబ్బంది ఉన్నారు. నూతన కళాశాలలు 5 ఏర్పాటు అయ్యాయి. బీర్కూర్, నాగిరెడ్డిపేట, నిజాంసాగర్, బీబీపేట, బిచ్కుందలలో కళాశాలలు కొనసాగుతున్నాయి.



ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం

ఆంధ్రజ్యోతి: నూతన కళాశాలల్లో బిల్డింగ్, సౌకర్యాలు, సిబ్బంది కొరత ఏమైనా ఉందా?

అధికారి: నూతన కళాశాలలు 5 ఏర్పాటు అవ్వగా బిల్డింగ్, సౌకర్యాల కల్పన ఏర్పాటు అయ్యే వరకు నాగిరెడ్డిపేట ప్రభుత్వ పాఠశాలలోనే కళాశాలను, బీబీపేట ప్రభుత్వ పాఠశాలలోనే కళాశాలను, ఇతర కళాశాలలను స్థానికంగా ఉన్న సౌకర్యాల మేరకు కొనసాగిస్తున్నాం. సిబ్బంది కొరత లేకుండా చూస్తున్నాం. ఆయా కళాశాలలో సబ్జెక్టుల వారీగా అధ్యాపకులను ఏర్పాటు చేశాం. మిగిలిన అధ్యాపకులను పక్కన ఉన్న మండలాల నుంచి వారానికి రెండుసార్లు పంపి విద్యార్థులకు బోధన చేసేలా చర్యలు తీసుకున్నాం.

ఆంధ్రజ్యోతి: గ్రామీణ ప్రాంత విద్యార్థులకు బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. మీరేమైనా చర్యలు తీసుకున్నారా?

అధికారి: పలుచోట్ల గ్రామీణ ప్రాంత విద్యార్థులు బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారనేది వాస్తవమే. ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు నా దృష్టికి తీసుకువస్తే జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయా ఆర్టీసీ డీఎంలతో చర్చించాం. ఆయా మండలాల్లో విద్యార్థులకు కళాశాలలకు సమయానికి అనుగుణంగా బస్సులను ఏర్పాటు చేయాలని కోరాం.

ఆంధ్రజ్యోతి: వృత్తి విద్యా కోర్సులు ఉన్నాయా? ఉంటే ఏఏ కళాశాలలో అందుబాటులో ఉన్నాయి?

అధికారి: ఇంటర్ తర్వాత ఉద్యోగం సాధించేలా జిల్లాలో నాలుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వృత్తి విద్యా కోర్సులు అందుబాటులోకి తీసుకువచ్చాం. దోమకొండ కళాశాలలో ఏఎన్‌టీ, బాన్సువాడలో ఎంపీహెచ్‌డబ్ల్యు, ఎంఎల్‌టీ, సీఎస్ఈ, బీర్కూర్‌లో ఇంటర్ డైరీ టెక్నాలజీ, కామారెడ్డిలో ఎంపీహెచ్ డబ్ల్యు, ఎంఎల్‌టీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీరికి బోధన చేసేందుకు అధ్యాపకులు సైతం ఉన్నారు.

ఆంధ్రజ్యోతి: గత సంవత్సరం ఉత్తీర్ణత శాతం తగ్గింది. విద్యార్థుల్లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ఏం చేస్తున్నారు?

అధికారి: గత సంవత్సరం ఉత్తీర్ణత శాతం తగ్గడం వాస్తవమే. ప్రతీ నెల విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మీటింగ్‌ను ఏర్పాటు చేస్తున్నాం. విద్యార్థులు కళాశాలలకు ఎందుకు హాజరు కావడం లేదో తెలుసుకోవడంతో పాటు వారి ఉత్తీర్ణత శాతం పెంచేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రతీ విద్యార్థి కోసం ఉదయం, మధ్యాహ్నం వేళలో స్టడీ అవర్స్ ఏర్పాటు చేస్తూ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం.

ఆర్మూర్ ఎమ్మెల్యేను కలిసిన మునిపల్లి వీడీసీ



ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డిని సన్మానిస్తున్న మునిపల్లి వీడీసీసభ్యులు

జక్రాన్‌పల్లి,అక్టోబరు29(ఆంధ్రజ్యోతి):ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డిని మంగళవారం మునిపల్లివీడీసీసభ్యులు, బీజేపీనాయకులు కలిశారు. జక్రాన్‌పల్లి మండలం మునిపల్లి నుంచి ఆర్మూర్ మండలం అంకా పూర్ గ్రామం వరకు నూతనంగా 3.20కిలోమీటర్ల బీటీరోడ్డు నిర్మాణానికి రూ.3 కోట్ల 68లక్షల నిధులను ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి మంజూ రు చే యించారని గుత్ప లిఫ్ట్ సాధన కమిటీ చైర్మన్, బీజేపీ నాయకుడు బొబ్బిలి గంగారెడ్డి, వాకిల్ గంగారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి, వాకిల్ గంగారెడ్డి మునిపల్లి వీడీసీసభ్యులు శాలువ, బొకే, పూలమాలతో సన్మానించారు. ఈ నిధులు మంజూరు చేయించిన పైడి రాకేష్‌రెడ్డిని ముని పల్లి వీడీసీసభ్యులు, బీజేపీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుత్ప లిఫ్ట్ సాధన కమిటీ చైర్మన్, బీజేపీ నాయకులు మండల బీజేపీ ఉపాధ్యక్షుడు కమ్మరి సంతోష్, నాయకులు శేఖర్,భాస్కర్, మునిపల్లి వీడీసీసభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

● పవర్ లిఫ్టర్‌ను సన్మానించిన ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో వరల్డ్ పవర్ లిఫ్టింగ్ కాంగ్రెస్ హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీలలో బంగారు పతకాలు సాధించిన పవర్ లిఫ్టర్ జెస్సు వెంకట్‌ను అంకాపూర్‌లో మంగళవారం ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. ఆర్మూర్‌కు చెందిన జెస్సు స్రవంతి శ్రీనివాస్‌ల కుమారుడు జెస్సు వెంకట్ ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీలలో బెంచ్‌ప్రెస్ 120కిలోల వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో రెండు బంగారు పతకాలు సాధించారు. జెస్సు వెంకట్‌ను సన్మానించిన అనంతరం ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్మూర్ పట్టణానికి చెందిన యువకులు పవర్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం సాధించడం గర్వకారణమన్నారు. భవిష్యత్‌లో ఉత్తమ ప్రదర్శన చేసి జాతీయ, అంతర్జాతీయస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి జెస్సు అనిల్, పట్టణ కార్యదర్శి పులి యుగంధర్, దోండి ప్రకాష్, రాజ్‌కుమార్, నరేష్‌చారి, ఉదయ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధి చేస్తాం

● నిరుద్యోగ యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి
● గ్రంథాలయాల సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి



బోధన్‌లో గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న అంతిరెడ్డి రాజిరెడ్డి

బోధన్‌రూరల్,అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని గ్రంథాలయాల అభివృద్ధి చేస్తామని, నిరుద్యోగ యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాల సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని గ్రంథాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రంథాలయంలో పాఠకులతో మాట్లాడి గ్రంథాలయ సమస్యలపై మాట్లాడారు. గ్రంథాలయాలను ఆధునిక దేవాలయాలు అని, నిరుద్యోగులకు గ్రంథాలయాలు ఎంతో ఉపయోగపడతామన్నారు. పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచాలని నిరుద్యోగులు చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన చైర్మన్ యువతకు కావాల్సిన గ్రంథాలయానికి అవసరమైన మెటీరియల్ జాబితా తయారు చేసి అందించాలని గ్రంథపాలకుడిని ఆదేశించారు. ఆయన వెంట కౌన్సిలర్లు తూము శరత్ రెడ్డి, ఇమ్రాన్, తదితరులున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కోటగిరి,అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండలంలోని కొడిచర్ల మంజీర నది నుండి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు తహసీల్దార్ మల్లయ్య తెలిపారు. కొడిచర్ల, సిర్పూర్ మధ్య ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను తమ సిబ్బంది పట్టుకున్నారని తహసీల్దార్ తెలిపారు. ఇసుక ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించామని, అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవీపేట,అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగేపూర్‌లో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం జరుగుతుందని నాగేపూర్ సొసైటీ కార్యదర్శి రమేష్ తెలిపారు. నాగేపూర్ రైతు వేదిక ఆవరణలో ఉదయం10గంటలకు నాగేపూర్ సొసైటీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. చైర్మన్ శైలేష్ కుమార్ ఆధ్వర్యంలో ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం జరుగుతుందని ఆయన వివరించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

నవీపేట,అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చావిడి సమీపంలో ఉన్న రామాగౌడ్ కుటుంబానికి మంగళవారం "మీకోసం మేము" అనే సేవ సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేశారు. సోమవారం రామాగౌడ్ అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబం నిరుపేదకు చెందిన వారు కావడంతో మీకోసం మేము సేవ సంస్థ ఆధ్వర్యంలో 8వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈకార్యక్రమంలో సుంకరి మహిపాల్, మోహన్, రాజేందర్ గౌడ్, సందీప్‌గౌడ్, తదితరులున్నారు.

సెల్‌ఫోన్ చోరీ

నవీపేట,అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న ఫోటో స్టూడియోలో సోమవారం రాత్రి ఫోన్ చోరీకి గురైంది. అభంగపట్నంకు చెందిన తులసిరాం 20వేల రూపాయల విలువైన సెల్‌ఫోన్‌ను స్టూడియోలో చార్జింగ్ పెట్టి పక్కకు వెళ్లాడు. తిరిగి వచ్చే సరికి సెల్‌ఫోన్ మాయమైంది. ఈ విషయంపై బాధితుడు మంగళవారం నవీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవు

బోధన్‌రూరల్,అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని రూరల్ ఎస్‌ఐ మచ్చేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం బోధన్ మండలం ఏరాజ్‌పల్లి, ఊట్‌పల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరి వద్ద నుండి 3వేల నగదుతో పాటు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. పేకాట రాయుళ్లపై కేసు నమోదు చేశామన్నారు. గ్రామాలలో ఎవరైనా పేకాట ఆడిన, పేకాట నిర్వహించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గుండెపోటుతో ఎల్‌ఎం మృతి

ఆర్మూర్‌టౌన్, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): ఏర్గట్ల మండలం బట్టాపూర్‌కు చెందిన ఎల్‌ఎం శ్రీరాములు హైదరాబాద్‌లో గుండెపోటుతో మృతి చెందాడు. సిరికొండ మండల కేంద్రానికి చెందిన శ్రీరాములు గత ఐదేళ్లుగా ఆర్మూర్ సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహించేవాడు. ఇటీవల సాధారణ బదిలీలో భాగంగా ఏర్గట్ల మండలం బట్టాపూర్‌కు లైన్‌మెన్‌గా బదిలీ అయ్యారు. గత కొన్నేళ్ళ క్రితం విధి నిర్వహణలో భాగంగా విద్యుత్ స్తంభంపై నుండి పడడంతో కాలు విరిగినట్టు తెలిసింది. అలాగే తన తల్లి క్యాన్సర్‌తో బాధపడుతుండడంతో ఆసుపత్రుల చుట్టు వెళ్లాల్సి ఉంటుందని, ఏదైన సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వ హిసానని ఉన్నతాధికారులకు ప్రదేయపడినట్టు తెలిసింది. కాగా తన తల్లిని హైదరాబాద్‌కు చికిత్స కోసం తీసుకువెళ్ళారు. సోమవారం గుండెపోటుతో అక్కడే శ్రీరాములు మృతి చెందాడని సహోద్యోగులు తెలిపారు.

ప్రజాభిప్రాయం మేరకే రిజర్వేషన్ల ఖరారుకు ప్రతిపాదనలు

● రాష్ట్రంలో అన్ని వర్గాల నుంచి కమిషన్ వినతులను స్వీకరిస్తుంది ● నవంబర్ 13 వరకు సమగ్ర ఇంటింటి సర్వే కొనసాగుతుంది
● డిసెంబర్ 9లోగా ప్రభుత్వానికి కమిషన్ నివేదికను అందిస్తుంది ● నిజామాబాద్‌లో రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్



రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్



మాట్లాడుతున్న చైర్మన్ నిరంజన్

నిజామాబాద్ అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజలు వ్యక్త పరిచిన అభిప్రాయాలు, సలహాలు, సూచనలతో పాటు సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా వెల్లడయ్యే అంశాలను పరిగణలోకి తీసుకొని ప్రభుత్వా నికి సమగ్ర ప్రతిపాదనలతో కూడిన నివేదికను అందిస్తామని బీసీ కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో బీసీ కమిషన్ సభ్యులు తిరుమలగిరి సురేందర్, రాపోలు జయప్రకాశ్, బాలలక్ష్మిలతో కలిసి వివిధ సంఘాల నుంచి సోమవారం వినతిపత్రాలను స్వీకరించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు డాక్టర్ భూపతిరెడ్డి, లక్ష్మీకాంత్ రావులు హాజరై వినతిపత్రాలను అందించారు. ప్రజల సామాజిక, ఆర్థిక, స్థితిగతుల విశ్లేషణ కోసమే ప్రభుత్వం ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేను చేపడుతుందన్నారు. వచ్చే స్థానిక సంస్థల రిజర్వేషన్లపై దామాషా ప్రకారం ప్రభుత్వం నిర్ణయం తీసుకునే విధంగా నివేదికను అందిస్తామన్నారు. ఈ నివేదిక శాస్త్రీయ పద్ధతిలో ఉండే విధంగా కమిషన్ చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల వారిగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాపై ఆయా రాజకీయ పార్టీలు, కుల సంఘాలు, ప్రజల నుంచి అభ్యర్థనలను తీ సుకుంటున్నామని ఆయన తెలిపారు. స్థానిక సంస్థల పాలకవర్గాల పదవీ కాలం పూర్తయినా ఎన్నికలు జరగకపో వడం వల్ల కేంద్రం నుంచి వచ్చే నిధులు నిలిచిపోయాయని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేం దుకు రాష్ట్ర ప్రభుత్వం సమాయత్తం అవుతుందన్నారు. ఈ ఎన్నికల్లో ఆయా వర్గాలకు కల్పించవల్సిన రిజర్వేషన్ల అధ్యయన కోసం బీసీ కమిషన్ బహిరంగ విచారణ నిర్వహిస్తుందన్నారు. నవంబర్ మొదటి వారం నుంచి రాష్ట్రంలో చేపట్టనున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ద్వారా అన్ని వర్గాల ప్రజల ఆర్థిక, సామాజిక స్థితిగతులు వెల్లడికానున్నాయని ఆయన తెలి పా రు. రిజర్వేషన్ ఖరారు చేసేందుకు ఈ అంశాలు దోహదపడుతాయని అన్నా రు. బీహార్ రాష్ట్రంలో 62 శాతం బీసీల జనాభా ఉందని దీని ప్రకారం రిజర్వేషన్లు ఖరారు చే యాలని అక్కడి ప్రభుత్వం భావించగా ఆ రాష్ట్ర హైకోర్టు నిరాకరించిందని ఆయన తెలిపారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సర్వేను పూర్తి చేస్తా మన్నారు. ఇంటింటికి వచ్చే ఎన్యూమరేటర్లకు సహకరిస్తూ పూర్తి సమాచా రాన్ని అందించాల న్నారు. రాష్ట్రంలో నవంబర్ 13వ తేదీ వరకు సర్వే పూర్తవుతుందన్నారు. సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేసి డిసెంబర్ 9లోగా రాష్ట్ర ప్రభుత్వానికి, హైకోర్టుకు నివేదిక అందిస్తామన్నారు. బహిరంగ విచారణలో నేరుగా కలవకపోయిన కులసంఘాలు, ప్రజలు ఏవైనా సూచ నలు, సలహాలు ఇవ్వాలనుకుంటే హైదరాబాద్‌లోని బీసీ కమీ షన్ కార్యాల యంలో నవంబర్ 13లోపు అందించాలని కోరారు. నేరుగా కానీ, ఆన్‌లైన్ ద్వారా కానీ, పోస్ట్ ద్వారా కానీ అందించాలని కోరారు. ఈ బహి రంగ విచారణకు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంత్‌రావుతో పాటు వివిధ సంఘాల ప్రతినిధులు హాజరై తమ అభిప్రాయాలను తెలియజేశారు. జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మం తు, స్పెషల్ ఆఫీసర్ సతీష్, జిల్లా బీసీ సంక్షేమ అధికారిని స్రవంతితో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

● కమిషన్ చైర్మన్, సభ్యులకు స్వాగతం పలికిన కలెక్టర్, అధికారులు

జిల్లాకు వచ్చిన బీసీ కమీషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులకు జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు స్వాగతం పలికారు. ఆయనతో పాటు అధికారులు కూడా స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. జిల్లాలో సమగ్రత కుటుంబ సర్వే, ఎన్యూమరేటర్ల నియామకం, హెల్ప్‌డెస్కుల వంటి అంశాలను కమీషన్ చైర్మన్‌కు కలెక్టర్ వివరించారు.మాస్టర్ ట్రైనర్ల ద్వారా ఎన్యూమరేటర్లకు శిక్షణ ఇవ్వడంతో పాటు పూర్తిస్థాయిలో కుటుంబ సర్వే చేపడుతామని ఆయన తెలిపారు.

● రోజంతా వినతులు స్వీకరించిన కమిషన్

జిల్లా కలెక్టరేట్‌లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కమిషన్ చైర్మన్, సభ్యులు నిజామాబాద్ జిల్లాకు సంబంధించిన వినతులను స్వీకరించారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం 5గంటల వరకు కామారెడ్డి జిల్లాకు సంబంధించిన వివిధ సంఘాల నుంచి వినతులను స్వీకరించారు. పలు సంఘాల నేతలు హాజరై వినతులను కమీషన్‌కు అందించారు.

● కాంగ్రెస్ బడుగు బలహీన వర్గాల కోసమే పనిచేస్తుంది: ఎమ్మెల్యే భూపతిరెడ్డి



తెలంగాణ ఏర్పాటు తర్వాత బడుగు బలహీన వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని ఆశించామని కానీ అలా జరగలేదన్నారు. బీసీ కమిషన్ చైర్మన్‌ను కలిసి ఆయన వినతిపత్రాన్ని అందించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బడుగు బలహీన వర్గాల వారి సంక్షేమం కోసం పనిచేస్తుందన్నారు. బీసీ కమిషన్ నియమించడంతో పాటు జనగణన చేపట్టిందన్నారు. స్థానిక సంస్థల్లో జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్‌లు దక్కాలన్నారు. నిధుల వాటా కూడా ఎవరికి ఎంతో నిర్ణయించాల్సిన అవసరం ఉందన్నారు. కులవృత్తుల వారందరికి ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని కల్పించాలన్నారు. పోటీ పరీక్షల సన్నద్ధం కోసం స్టడీ సర్కిల్స్‌ను అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేయాల న్నారు. సంచార జాతుల కోసం ప్రత్యేక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. గల్ఫ్ వెళ్లేవారికి న్యాక్ ద్వారా స్కిల్ శిక్షణ అందించాలని ఆయన కోరారు.

● బీసీ కులగణనలో అందరూ పాల్గొనాలి : ఎమ్మెల్యే లక్ష్మీకాంత్‌రావు



బీసీ కులగణనలో అందరూ పాల్గొనాలని ఎమ్మెల్యే లక్ష్మీకాంత్‌రావు పిలు పునిచ్చారు. జుక్కల్ నియోజకవర్గానికి సంబంధించి నివేదికను ఆయన బీసీ కమిషన్ చైర్మన్‌కు అందించారు. పూర్తిస్థాయిలో నియోజకవర్గంలో ఈ సర్వే జరిగేందుకు తనవంతు సహకారాన్ని అందిస్తామన్నారు. బీసీలకు నిజమైన ఫలాలు సర్వే ద్వారానే అందుతాయని అన్ని సంఘాల నేతలు పాల్గొని అవగాహన కల్పించాలన్నారు. సర్వే సందర్భంగా పదిరోజుల పాటు అంద రూ అందుబాటులో ఉండి పూర్తివివరాలను అందించాలని కోరారు. ఈ సర్వే ఆధారంగానే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పిస్తారని ఆయన తెలిపారు.

● బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి

బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పోతన్‌కర్ లక్ష్మీనారాయణ కోరారు. బీసీ కమిషన్ చైర్మన్‌ను కలిసి వినతిపత్రాన్ని ఆయన అందించారు. రాష్ట్రంలో 56 శాతం ఉన్న బీసీలకు అన్ని పార్టీలు మోసం చేస్తున్నాయని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో రిజర్వేషన్లను తగ్గించడం వల్ల బీసీలకు పదవుల్లో అవకాశం రాలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ను అందిస్తామని, కామారెడ్డి బీసీ గర్జన సభలో విడుదల చేసిన డిక్లరేషన్‌లో హామీ ఇచ్చారని అన్నారు. పది నెలలు గడిచినా రిజర్వేషన్లపై ఎలాంటి ప్రకటన చేపట్టలేదన్నారు. బీసీ గణన చేసేందుకు బీసీ అధికారులనే నియమించాలని ఆయన కోరారు.

ఆర్మూర్‌లో బేకరీషాప్‌ల తనిఖీలు

ఆర్మూర్‌టౌన్,అక్టోబరు29(ఆంధ్రజ్యోతి):ము న్సిపల్ పరిధిలోని పలు బేకరీ షాప్‌లను మంగళ వారం మున్సిపల్ అధికారులు తనిఖీలు నిర్వహిం చారు. షాప్‌లలో ప్లాస్టిక్‌లను వినియోగించవద్దని, తక్కువ మైక్రోన్ గల ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసు కొని జరిమానాలు విధించారు. అలాగే షాప్‌లలో శుచి శుభ్రత పాటించాలని, తాజాకరమైన ఆహారా న్ని అందించాలని, లేని పక్షంలో భారీ జరిమా నాలు విధిస్తామని మున్సిపల్ అధికారులు సూ చించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్‌పెక్టర్ గజానంద్, పర్యవరణ ఇంజనీర్ పూర్ణమౌళి, మున్సిపల్ సిబ్బంది సంతోష్, రాము, నరేష్, అర్జున్, అక్షయ్, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

సర్వే పనులను పరిశీలించిన అధికారులు

జక్రాన్‌పల్లి,అక్టోబరు29(ఆంధ్రజ్యోతి):మండలంలోని తొర్లికొండ గ్రా మంలో సీఆర్ఆర్ కింద చేపట్టే సర్వే పనులను అధికారులు పరిశీ లించారు. మంగళవారం తొర్లికొండ గ్రామం నుంచి మనోహరాబాద్ వరుక బీటీరోడ్డు చెడిపోగా అలాగే తొర్లికొండ రాజసాగర్ చెరువు వద్ద కొట్టుకు పోయిన బ్రిడ్జిని నూతన నిర్మించేందుకు పీఆర్‌ఏఈ డి.సురేం దర్‌వర్మ కలిసి సర్వే పనులు చేయించారు. సీఆర్‌ఆర్ కింద చేపట్టే పనులకు రూ.80లక్షల నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి మంజూరు చేయించారని మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ఆర్మూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కనక రవి, వినోద్‌లు తెలిపారు.ఆయన వెంట మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్ల గంగా రెడ్డి, వినోద్, జేఈ గంగారాం,సాయిరెడ్డి, రాజేష్‌గౌడ్‌లు ఉన్నారు.



కొట్టుకుపోయిన బ్రిడ్జిని పరిశీలిస్తున్న అధికారులు

స్పీకర్‌ను కలిసిన మాదిగ సంఘాల నేతలు



స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను కలిసిన మాదిగ సంఘాల రాష్ట్ర నాయకులు

ఆర్మూర్‌టౌన్, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని స్పీకర్ చాంబర్‌లో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను మంగళవారం మాదిగ సంఘాల రాష్ట్ర నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్సీ, ఎస్టీల సమస్యలతో పాటు అభివృద్ధి అంశాలపై స్పీకర్‌తో చర్చించారు. ఈ కార్యక్రమంలో మాదిగ సంఘాల యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొక్కెర భూమన్న, మాదిగ హక్కుల దండోర రాష్ట్ర అధ్యక్షుడు రేనుగుంట సునీల్, డాక్టర్ రామకృష్ణ, కవ్వంపల్లి రవి, రమేష్, రాజేందర్, పోశన్న, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన



సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

ఏర్గట్ల,అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. అందులో భాగంగా మెడికల్ ఆఫీసర్ ప్రసన్న ప్రియ విద్యార్థు లకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం పాఠశాలలో వంటగదిని పరిశీలించారు.ఈకార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది లింబాద్రి, మోతిరాం, పండరి, కల్పన, త్రివేణి, ఎస్‌వో సంధ్య పాల్గొన్నారు.

రైతు భరోసా తక్షణమే అందజేయాలని తహసీల్దార్‌కు వినతి

రెంజల్,అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలో భాగంగా ప్రతి రైతుకు రైతు భరోసాను తక్షణమే విడుదల చేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పుట్టి నాగన్న, జిల్లా సహాయ కార్యదర్శి నసీర్‌లు అన్నారు. మంగళవారం తహసీల్దార్ శ్రావణ్ కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం నేటి వరకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు నష్టపోతున్నారని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే రైతులు దళారుల పాలు కాకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయిస్తారని, ప్రభుత్వం మాత్రం నేటి వరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారులను ప్రోత్సహిస్తుందని అన్నారు.రెండు లక్షల రుణమాఫీ, సన్నరకం, దొడ్డురకం ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఒడ్డెన్న, సిద్ద పోశెట్టి, శంకర్, గోపాల్, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

అండర్-17 బాలబాలికల జిల్లా హాకీ జట్ల ఎంపిక



జిల్లా హాకీ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

ఆర్మూర్‌రూరల్, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని మినీస్టేడియంలో అండర్ -14, అండర్-17 బాలబాలికల జిల్లా హాకీ జట్లను మంగళవారం ఎంపిక చేసినట్టు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగమణి, పీడీలు సదమస్తుల రమణ, పింజ సురేందర్‌లు తెలిపారు. జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారుల నుంచి నవంబర్ 1వ తేదీన ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారన్నారు. తుది జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెలలో సంగారెడ్డిలో జరగనున్న రాష్ట్రస్థాయి బాలుర హాకీ పోటీల్లో, నిజామాబాద్‌లో జరగనున్న బాలికల రాష్ట్రస్థాయి హాకీ పోటీలలో పాల్గొంటారన్నారు. ఈ కార్య క్రమంలో ఫిజికల్ డైరెక్టర్‌లు చిన్నయ్య, స్వామి, నగేష్, గోపిరెడ్డి, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

రైతులు చెరకు సాగుకు ముందుకు వస్తే ఫ్యాక్టరీని పునరుద్ధరిస్తాం

● త్వరలో ఇంజనీర్లతో ఫ్యాక్టరీ కండిషన్‌ల పరిశీలన
● బోధన్ నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని పరిశీలించిన ఎమ్మెల్యే
● త్వరలోనే రెండు లక్షల రుణమాఫీ
● జిల్లా కేంద్రంలో కంటి ఆసుపత్రికి స్థలాన్ని అందిస్తాం
● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



బోధన్‌లో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

బోధన్‌రూరల్,అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): చెరకు పంట పండించడానికి రైతులు ముందుకు వస్తానే ఫ్యాక్టరీని పునరుద్ధరిస్తామని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నిజాంషుగర్స్‌ఫ్యాక్టరీని ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో నిజాంషుగర్స్‌ఫ్యాక్టరీ ఇంజనీర్ల బృందం రానుందని, ఇంజనీర్‌లు ఫ్యాక్టరీని పరిశీలిస్తారన్నారు. ఫ్యాక్టరీలోని యంత్రాల కండిషన్‌ను పరిశీలిస్తారన్నారు. ఫ్యాక్టరీ మిషనరీ, విస్తర్ణం, తదితర అన్ని అంశాలపై ఇంజనీర్లు చర్యలు చేపడతారన్నారు. చెరకు పంట దిగుబడికి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. రైతులకు ఉచితంగా చెరకు సీడ్స్ అందించడం జరుగుతుందన్నారు. చెరకు పంట పండించిన తర్వాత లేబర్ సమస్య లేకుండా నూతన యంత్రాలతో చెరకు కట్టింగ్‌కు ఏర్పాట్లు చేస్తామన్నారు. ఫ్యాక్టరీ పునరుద్దరణ విషయంపై ముఖ్యమంత్రితో చర్చిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్టరీ అధికారులతో పాటు ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, నాగేశ్వర్ రావు, ఆదినారాయణ, పులి శ్రీనివాస్, జనార్ధన్, అల్లె రమేష్, తహసీల్దార్ విఠల్, తదితరులు పాల్గొన్నారు.

● ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

బోధన్‌రూరల్: రైతులు పండించిన ప్రతి గింజను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకుని ధాన్యాన్ని విక్రయించి మద్దతు పొందాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఏ గ్రేడ్ రకం ధాన్యానికి రూ.2320, గ్రేడ్ బీ రకం ధాన్యానికి రూ.2300లకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రైతులు దళారులకు విక్రయించి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, బోధన్ మున్సిపల్ చైర్మన్ తూము పద్మ శరత్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అంకు సంధ్య దాము, సొసైటీ చైర్మన్ ఉద్మీర్ లక్ష్మణ్, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, డీసీసీబీ డైరెక్టర్, రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

● ధాన్యం సొమ్మును మిల్లర్ల నుంచి రికవరీ చేస్తాం

ప్రభుత్వానికి మిల్లర్లు చెల్లించాల్సిన సీఎంఆర్ రైస్ బకాయిలపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. మిల్లర్ల నుండి బకాయిలు రాబట్టడానికి తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయన్నారు.

రుద్రూర్‌లో చెరకు, కూరగాయల కొత్త వంగడాలను పరిశీలన

రుద్రూర్ మండల కేంద్రంలోని వ్యవసాయ కృషి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి వ్యవసాయశాఖ, ఉద్యాన వన శాఖ అధికారులతో, శాస్త్రవేత్తలతో సమావేశం నిర్వహించారు. చెరకు, కూరగాయల పంటలలో కొత్త వంగడాలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, గ్రంథాలయాల సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి, నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పా గంగారెడ్డి, కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సయ్య, వేల్పూర్ చైర్మన్ ముత్యంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పాల్గొన్నారు.

రెంజల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, తహసీల్దార్ శ్రావణ్ కుమార్, మండల అధ్యక్షులు మొబిన్ ఖాన్, సొసైటీ చైర్మన్ మొయినోద్దీన్, మహిళ సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మి, ఏపీఎం చిన్నయ్య, సొసైటీ కార్యదర్శి ఇంద్రసేన్, నాయకులు సాయిరెడ్డి, ఐకేపీ సీసీలు, సొసైటీ సిబ్బంది ఉన్నారు.

● బోధన్ లయన్స్ కంటి ఆసుపత్రి సేవలు అభినందనీయం

బోధన్‌రూరల్: బోధన్ లయన్స్ కంటి ఆసుపత్రి సేవలు అభినందనీయమని, దినదినాభివృద్ధి చెందుతూ పేదలకు కంటి చూపుప్రసాదించడం అభినందనీయమని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని లయన్స్‌కంటి ఆసుపత్రి భవనంలో నూతనంగా ఆధునిక పరికరాలతో రూ.50లక్షలలతో ఏర్పాటు చేసిన కంటి ఆపరేషన్‌కు సంబంధించిన యంత్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, లయన్స్ ప్రతినిధులు లక్ష్మి, బసవేశ్వర్‌రావు, కిషోర్ కుమార్, ఉమేష్ షిండే, నాగేశ్వర్ రావు, ఆదినారాయణ, శ్రీనివాస్, ప్రదీప్ గుప్తా, పావులూరి వెంకటేశ్వర్ రావు, చక్రవర్తిలతో లయన్స్ సభ్యులు, పట్టణ ప్రముఖులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా సాయిబాబాగౌడ్ నియామకం

ఆర్మూర్‌రూరల్, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా సాయిబాబాగౌడ్‌ను నియమించారు. మంగళ వారం మాజీమంత్రి, బోదన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సాయిబాబాగౌడ్‌కు నియమకపత్రాన్ని అందజేశారు. తనను ఆర్మూర్ వ్యవ సాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమించిన సీఎం రేవంత్‌రెడ్డి, బోదన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి ఇందుకు సహకరించిన పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ వినయ్‌రెడ్డిలకు సాయిబాబాగౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్‌హందాన్, నూడ చైర్మన్ కేషవేణు, పాల్గొన్నారు.

హోరాహోరీగా కొనసాగుతున్న కబడ్డీ, వాలీబాల్ పోటీలు

మెండోర, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో మాకూరి వినోద్, గుంటి రవి స్మారక కబడ్డీ, వాలీబాల్ ఓపెన్ టోర్నమెంట్ పోటీలు రెండవ రోజు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా వాలీబాల్‌లో కరీంనగర్, నిజామాబాద్ జట్ల మధ్య హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో నిజామాబాద్ జట్టు విజయం సాధించింది. కబడ్డీలో కామారెడ్డి, నిర్మల్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో నిర్మల్ జట్టు విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో వ్యాయమ ఉపాధ్యాయులు శ్యామ్; సురేందర్, అన్వేష్, అంబేద్కర్ యూత్ సభ్యులు గణేష్, మహేష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులకు మూడు పతకాలు

మోర్తాడ్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకెట్ గ్రామశివారులోని గిరిజనతాండా ఎన్‌టీపీఎస్ పాఠశాలలో నిర్వహించిన రంగోత్సావ సెలబ్రేషన్‌లో ముగ్గురు విద్యార్థులకు బహుమతులు పొందారు. పాఠశాలకు చెందిన సవిత, అశ్విత, అబిజ్ఞ అనే పిల్లలకు గోల్డ్, సిల్వర్, క్యాంస పతకాలు పొం దారు. విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు దండు గంగాధర్ పతకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్ శృతి, గ్రామ కమిటీ సభ్యులు వినోద్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

ఫోకస్

ఆదరణ కోల్పోతున్న సింగిల్ స్ర్కీన్ థియేటర్స్



శ్రీదేవి థియేటర్‌లో ఏర్పాటైన వస్త్ర దుకాణం



మూతపడ్డ తిరుమల థియేటర్

- ఉమ్మడి జిల్లాలో మూతపడ్డ 20కి పైగా థియేటర్లు
- షాపింగ్ మాల్స్, ఫంక్షన్ హాళ్లుగా వినియోగం
- మల్టీప్లెక్స్, ఓటీటీల వల్ల మూతపడుతున్న థియేటర్లు

నిజామాబాద్ అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు సినిమా విడుదలైందంటే చాలు థియేటర్ల వద్ద పండగ వాతావరణం ఉండేది. ప్రధాన పండగలైన దసరా, దీపావళి, సంక్రాంతి ఇతరత్ర పండుగలకు కొత్త సినిమాలు విడుదలైతే థియేటర్ల వద్ద అభిమానుల కోలాహలం ఉండేది. తమ అభిమాన హీరో సినిమా చూసేందుకు అభిమానులు పోటీపడి థియేటర్లకు వచ్చేవారు. కొన్ని ఫ్యామిలీ సినిమాలకు ఇంటిల్లిపాది మొత్తం సినిమా చూసేందుకు వచ్చేవారు. తర్వాత సినిమా థియేటర్లకు జనాలు రావడం పూర్తిగా తగ్గిపోయింది. దీంతో థియేటర్లు పూర్వ ప్రాభావ్యాన్ని క్రమంగా కోల్పోతున్నాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో గత పది సంవత్సరాలుగా 20కి పైగా థియేటర్లు మూత పడ్డాయంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. జిల్లా కేంద్రాలకు మల్టీప్లెక్స్ థియేటర్లు రావడంతో ప్రజలు అన్ని సౌకర్యాలు ఉన్న మల్టీప్లెక్స్‌లవైపే మొగ్గు చూపుతున్నారు. చిన్న పిల్లల నుంచి మొదలుకొని పెద్దవారి వరకు మల్టీప్లెక్స్‌లో సినిమాలు చూసేందుకు ఆసక్తి చూపుతుండటంతో సింగిల్ స్ర్కీన్ థియేటర్లు క్రమంగా తమ ఆదరణను కోల్పోతున్నాయి. దీంతో అనేక ఏళ్లుగా సినిమా థియేటర్లలో పనిచేస్తున్న కార్మికులు తీవ్రంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. థియేటర్లు నడవక ఇతర చోట్లలో పనిచేయలేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. థియేటర్ల యజమానులు సైతం థియేటర్లను తొలగించి వాటి స్థానంలో సూపర్ మార్కెట్లు, షాపింగ్ మాల్స్, ఫంక్షన్ హాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు.



నగరంలోని మల్టీ ప్లెక్స్

ఉమ్మడి జిల్లాలో 20కి పైగా థియేటర్ల మూత

నిజామాబాద్ ఉమ్మడి జిల్లా పరిధిలో గత పదేళ్ల కాలంలో 20కి పైగా థియేటర్లు మూతపడ్డాయి. వాటి స్థానాల్లో ఇప్పుడు కొన్నిచోట్ల షాపింగ్ మాల్స్, అపార్ట్‌మెంట్‌లు, ఇతరత్ర భవనాలు నిర్మాణంలో ఉన్నాయి. నిజామాబాద్ నగరంలో గతంలో రాధాకృష్ణ థియేటర్, జయలక్ష్మి థియేటర్, పిక్చర్ ప్యాలెస్ (శ్రీదేవి), ప్రభాత్ థియేటర్, పవన్ థియేటర్, తిరుమల థియేటర్‌లు ఉండేవి. అవి కొన్ని కారణాల వల్ల మూతపడ్డాయి. జనాలు కూడా థియేటర్లకు రావడం మానేయడంతో క్రమంగా థియేటర్లు మూతపడ్డాయి. బస్టాండ్ వద్ద ఉన్న అశోక్ థియేటర్ స్థానంలో ఇటీవల రిలయన్స్ సూపర్ మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. శ్రీదేవి థియేటర్‌ను సైతం షాపింగ్ మాల్‌గా మార్చారు. రమేష్ థియేటర్ స్థానంలో సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ వస్త్ర దుకాణాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం నగరంలో లలితామహాల్, విజయ్, దేవి, నటరాజ్ థియేటర్లు కొనసాగుతున్నాయి. వేణుమాల్, ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్ థియేటర్ల ఏర్పాటుతో సింగిల్ స్ర్కీన్ థియేటర్లకు జనాలు రావడం లేదు. కామారెడ్డిలో గతంలో ఆరు థియేటర్లు ఉండగా ప్రస్తుతం మూడు కొనసాగుతున్నాయి. బాన్సువాడలోనూ రెండు థియేటర్లలో ఒకటి కొనసాగుతుంది. భీర్కూర్‌లో ఉన్న ఒక్క థియేటర్ మూతపడింది. బోధన్‌లో ఆరు థియేటర్లు ఉండగా ప్రస్తుతం మూడు కొనసాగుతుండగా, మూడు మూతపడ్డాయి. నందిపేటలో రెండు థియేటర్లు ఉండగా రెండు మూతపడ్డాయి. ఆర్మూర్‌లో మూడు థియేటర్లు ఉండగా రెండు మూతపడగా ఒకటి కొనసాగుతుంది.

షాపింగ్ మాల్స్, సూపర్ మార్కెట్‌లుగా థియేటర్లు

సినిమా థియేటర్ల నిర్వహణ యజమానులకు కష్టతరంగా మారుతోంది. గతంలో పెద్దహీరోల సినిమాలు రిలీజై హిట్ అయితే వంద రోజులు నడిచేది. కానీ ప్రస్తుతం పది రోజులకు మించి ఏ సినిమా నడవడం లేదు. దీంతో మిగతా రోజుల్లో థియేటర్ల నిర్వహణ యజమానులకు కష్టతరంగా మారుతుంది. సిబ్బంది వేతనాలతో పాటు థియేటర్ల నిర్వహణ వ్యయంతో కూడుకోవడంతో థియేటర్ల యజమానులు థియేటర్లను మూసివేసి వాటి స్థానాల్లో షాపింగ్ మాల్స్, సూపర్ మార్కెట్‌లను ఏర్పాటు చేస్తున్నారు. కొందరు థియేటర్ల యజమానులు థియేటర్లను లీజ్‌కు ఇస్తున్నారు. నిజామాబాద్ నగరంలో రమేష్ థియేటర్, శ్రీదేవి థియేటర్లు మూతపడగా వాటి స్థానాల్లో వస్త్ర దుకాణాలను ఏర్పాటు చేశారు. అశోక్ థియేటర్ స్థానంలో రిలయన్స్ మాల్‌ను ఏర్పాటు చేశారు. జయలక్ష్మీ, రాధాకృష్ణ థియేటర్, రమేష్ థియేటర్లు మూతపడగా వాటిని అలాగే ఉంచారు. ఇతర ప్రాంతాల్లోనూ థియేటర్ల స్థానాల్లో ఫంక్షన్‌హాల్‌ను, అపార్ట్‌మెంట్‌లను ఏర్పాటు చేశారు.

మల్టీప్లెక్స్, ఓటీటీల ప్రభావం

అన్నిరకాల వసతులు, తినుబండరాలు, ప్రేక్షకులను ఆకట్టుకునే సౌకర్యాలతో నిర్మిస్తున్న మల్టీప్లెక్స్‌లలో సినిమాలను చూసేందుకు జనాలు ఆసక్తిని కనబరుస్తున్నారు. అధునాతన సౌకర్యాలతో సీట్లు, స్ర్కీన్‌లు ప్రేక్షకులను మల్టీప్లెక్స్‌ల వైపు వెళ్లేలా చేస్తున్నాయి. ఓటీటీలలో నూతనంగా రిలీజైన సినిమాలు వారం రోజులకే వస్తుండటంతో ప్రేక్షకులు ఇంటి వద్ద అందరూ కలిసి చూసేందుకే ఎక్కువగా ఆసక్తిని చూపుతున్నారు. దీంతో థియేటర్లకు జనాలు వచ్చే పరిస్థితి కనిపించకపోవడంతో సింగిల్ స్ర్కీన్ థియేటర్లు క్రమంగా మూతపడుతున్నాయి.



నగరంలో మూతపడ్డ రాధాకృష్ణ థియేటర్

ప్రేక్షకులు థియేటర్లకు రావడం లేదు

- దాసరి నాగేశ్వర్‌రావు, థియేటర్ మేనేజర్



కరోనా తర్వాత ప్రేక్షకులు థియేటర్లకు రావడం క్రమంగా తగ్గిపోయింది. ఓటీటీల ప్రభావంతో సినిమా విడుదలైన వారం పది రోజులకే టీవీలలో వస్తుండటంతో ప్రేక్షకులు థియేటర్లకు రావడం లేదు. మల్టీప్లెక్స్‌ల నిర్మాణం కూడా సింగిల్ స్ర్కీన్ థియేటర్లకు రావడం తగ్గిపోయింది. ఉమ్మడి జిల్లా పరిధిలో గత ఐదు సంవత్సరాల కాలంలో 15కు పైగా థియేటర్లు మూతపడ్డాయి. మళ్లీ థియేటర్లకు పూర్వవైభవం రావాలని కోరుకుంటున్నాం.

క్రీడలలో గెలుపొందిన విద్యార్థిని పతకాలు చూపిస్తున్న బాలికలు



అండర్-17 క్రీడా పోటీల్లో ఎల్లారెడ్డి గిరిజన బాలికల ప్రతిభ

- ఒకే పాఠశాలకు 15 పతకాలు సొంతం

ఎల్లారెడ్డి, అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి): గిరిజన గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు జిల్లాస్థాయి క్రీడాపోటీల్లో ప్రతిభ కనబరిచారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఇందిరా గాంధీ స్టేడియంలో గత కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న అండర్-17 విభాగంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలలో ఎల్లారెడ్డి గిరిజన బాలికల గురుకుల విద్యార్థినులు పాల్గొని 15 పథకాలు సొంతం చేసుకున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మాడ సావిత్రి తెలిపారు. అందులో మూడు స్వర్ణ, నాలుగు రజత, ఎనిమిది కాంస్య పతకాలు సాధించారు. అండర్ -17 విభాగంలో జరిగిన మూడు కిలో మీటర్ల పరుగు పందెం పోటీల్లో నందిని (బంగారు), ఎల్.సునీత (కాంస్య), 1500 మీటర్ల పందెంలో ఎం.అర్చన (స్వర్ణ), బి.కళ్యాణి (కాంస్య), 800 మీటర్ల పందెంలో అర్చన (కాంస్య), 400 మీటర్ల పందెంలో స్పందన (స్వర్ణ), కె.సునీత (రజత), 200 మీటర్ల పందెంలో ఎ.నక్షత్ర (కాంస్య), 100 మీటర్ల పందెంలో నక్షత్ర (కాంస్య), షార్ట్ పుట్ అండర్-14 విభాగంలో వంద మీటర్ల పోటీలో ఎస్.అఖిల (కాంస్య), 400 మీటర్ల పోటీలో కె.ఇందు (రజత), 600 మీటర్ల విభాగంలో డి.సంధ్య (రజత), హైజంప్‌లో ఎస్. హారిక (కాంస్య), లాంగ్ జంప్‌లో ఆర్.ఆమూల్య (కాంస్య) పతకాలు దక్కించుకున్నారు.

విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయడమే లక్ష్యం: ప్రిన్సిపాల్

విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు కృషిచేస్తున్నాం. విద్యతోపాటు క్రీడలతో మానసిక ఉల్లాసమే శారీరక దారుఢ్యాన్ని పెంపొందించేందుకు ప్రయత్నిస్తున్నాం. అందరి సహకారంతోనే ఈ విజయాలు సాధించగలిగాం.

అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

- పోలీసుల అమరవీరుల వారోత్సవాలు
- ఎల్లారెడ్డిలో రక్తదాన శిబిరం ఏర్పాటు

ఎల్లారెడ్డి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసులు అమరవీరుల త్యాగాలు చిరస్మనీయమని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఎల్లారెడ్డి పోలీస్‌శాఖ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలోని ఉన్న ముత్యపు రాఘవులు ఫంక్షన్ హాల్‌లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎస్పీ శ్రీనివాసులు పాల్గొని ప్రారంభించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రక్తం ఏ ఫ్యాక్టరీలలోనూ తయారు కాదని, రక్తదానం చేయడమే మార్గమని అన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా సుమారు 50 మంది యువకులు పోలీసులు పాల్గొని రక్తదానం చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీఐ రవీందర్ నాయక్, ఎస్సై బొజ్జ మహేష్, కానిస్టేబుళ్ళు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన యువకులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.



రక్తదానం చేస్తున్న సీఐ రవీందర్, ఎస్సై మహేష్

జర దేఖో!!

జూదం.. కట్టడికి చర్యలేవీ?



పొతంగల్ మండలం కొల్లూర్‌లో పేకాట స్థావరంపై దాడి చేసిన దృశ్యం (ఫైల్‌ఫొటో)

కోటగిరి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వ్యసనాల్లోకెల్లా జూదం అతిప్రమాదకరమైంది. దీనికారణంగా డబ్బులు పోగొట్టుకుని ఆర్థికంగా చితికిపోయిన కుటుంబాలు ఎన్నోఉన్నాయి. ముఖ్యంగా పండుగల ముసుగులో దుకాణాలు, వ్యాపార, వాణిజ్య సంస్థల్లో జూదం ఆడడం ఆనవాయితీగా వస్తోంది. ప్రస్తుత దీపావళి పండుగ మరో రెండు రోజుల్లో ఉందనగానే జిల్లావ్యాప్తంగా జూదం ప్రారంభమైంది. జిల్లాలోని పలు డివిజన్లలో ఇప్పటికే పేకాటకేసులు నమోదవుతున్నాయి. జిల్లాలో జూదం నివారణకు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామాలకు దూరంగా పేకాట కేంద్రాలు

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో నిరక్షరాస్యత ఎక్కువగా ఉండిఉపాధి అవకాశాలు తక్కువగా ఉన్నాయి. జిల్లాలో ఎక్కువ మంది వ్యవసాయం, కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. అనేక గ్రామాల్లో వ్యవసాయ పనులు ముగించుకుని వచ్చాక హోటళ్లు, ఛాయ్ దుకాణాలు, బహిరంగ ప్రదేశాలు, చెట్ల కింద, పాత ఇళ్లలో జూదం ఆడడం సాధారణంగా మారుతోంది. కొన్ని ప్రాంతాల్లో హోటల్ వారు తమకు ఆదాయం వస్తుందన్న అత్యాశతో ఈ ఆటను ప్రోత్సహిస్తున్నారు. పేకాట ఆడుతున్న సమయాల్లో మద్యం, కల్లు సేవించడం సాధారణంగా మారింది. దీంతో ఘర్షణలు, గొడవలు జరుగుతున్నాయి.

పేకాటపై కట్టుదిట్టమైన చర్యలు అవసరం

దీపావళి లక్ష్మీపూజ అనంతరం భక్తులు రాత్రంతా జాగారం చేస్తుంటారు. ఈ సమయాల్లో నిద్రరాకుండా జూదం ఆడడం జరుగుతోంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కర్ణాటక, మహరాష్ట్రలకు సరిహద్దున ఉండడంతో ఆటలో ఆరితేరిన వారు జూద కేంద్రాలను నిర్వహిస్తుంటారు. మహరాష్ట్ర, కర్ణాటక నుండి పలువురు ఇక్కడికి రావడం, ఇక్కడి వారు అక్కడికి వెళ్లడం సాధారణంగా జరుగుతోంది. దీపావళి సందర్భంగా పంట పొలాల్లో సరిహద్దు గ్రామాల్లో పేకాట కేంద్రాలు నిర్వహిస్తున్నారని సమాచారం. పేకాట కట్టడికి తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైన ఉందని ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యేక నిఘా పెట్టాం..

- సందీప్, ఎస్సై, కోటగిరి



దీపావళి పండుగ సందర్భంగా పేకాట స్థావరాలపై ప్రత్యేక నిఘా పెట్టాం. పేకాట ఆడితే చట్టపరమైన చర్యలు తప్పవు. ప్రజలు సైతం గ్రామాలలో పేకాట నిర్వహిస్తే సమాచారం ఇవ్వాలి.

పేకాట ఆడితే సమాచారం అందించాలి..

పేకాట ఆడితే పోలీసులకు సమాచారం అందించాల్సిన బాధ్యత స్థానికులపైనే ఉంది. ఆయా పోలీస్ స్టేషన్‌ల పరిధిలో పేకాట కేంద్రాలు కొనసాగితే సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరుతున్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పోలీసులు స్పష్టం చేస్తున్నారు. తద్వారా పేకాటను జిల్లాలో పేకాటను అరికట్టే అవకాశం ఉంది.

పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవు

బోధన్ రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం బోధన్ మండలం ఏరాజ్‌పల్లి, ఊటీపల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరి వద్ద నుంచి 3వేల నగదుతోపాటు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. పేకాటరాయుళ్లపై కేసు నమోదు చేశామన్నారు. గ్రామాలలో ఎవరైనా పేకాట ఆడిన, పేకాట నిర్వహించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆంధ్రజ్యోతి పరిశీలన



అధ్వానంగా మారిన వెల్లుట్ల రహదారి

నడకకూ నరకమే..!

- అధ్వానంగా తయారైన గాంధారి రోడ్డు
- ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు, నాయకులు

గాంధారి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక, మహారాష్ట్ర బోర్డర్లకు వెళ్లేందుకు గూగుల్ మ్యాప్‌లో కనిపిస్తున్న ఆ రోడ్డు చాలా అధ్వానంగా తయారైంది. దానిగుండా ప్రయాణిస్తే మాత్రం నరకాన్ని చూపెడుతోంది. కనీసం అడుగు తీసి అడుగుపెట్టే పరిస్థితి లేకుండా పోతుందని వాహనదారులు పేర్కొంటున్నారు. ఈ రోడ్డును గాంధారి మండలం నుంచి ఎల్లారెడ్డి, వెల్లుట్ల నిజాంసాగర్, ఎల్లారెడ్డికి వెళ్లడానికి ప్రధానంగా వినియోగిస్తుంటారు. గత కొన్ని సంవత్సరాలుగా మరమ్మతులకు నోచుకోకపోవడంతో ఈ రోడ్డుపై వెళ్లాలంటే ప్రయాణికులు నరకం చూస్తున్నారు. గూగుల్ మ్యాప్ ఈ రోడ్డుపై గోవా ఇతర ప్రాంతాలకు చూపించడంతో తెలియని వాళ్ల ఈరోడ్డుపై వచ్చి ఎటూ వెళ్లలేక రోడ్డు బాగా లేక ఇబ్బంది పడుతూ రాత్రివేళలో చాలామంది గండివేట్ గ్రామానికి చేరుకొని ప్రజల సహకారంతో వేరే ప్రాంతాల నుంచి వెళ్తున్నారు. ఈ రోడ్డు వర్షాలకు కొట్టుకుపోవడంతో పెద్దపెద్ద గుంతల మయంగా మారిపోయింది. చుట్టుపక్కల గ్రామాలు ఎన్నోసార్లు ప్రజాప్రతినిధులకు అధికారులకు మొరపెట్టుకున్న రోడ్డుకు ఎలాంటి మరమ్మతులు కూడా చేయకపోవడంతో నానా ఇబ్బందులు ఎదుర్కోంటున్నారు. గాంధారి మండలంలోని చాలా గ్రామాలు ఎల్లారెడ్డితో పాటు నిజాంసాగర్, పిట్లం, బీదర్, కర్ణాటక మీదుగా వెళ్లడానికి ఈ ప్రజలకు ప్రత్యేకంగా ఉపయోగంగా ఉంటుంది. గండివేట్ మీదుగా వెల్లుట్ల గ్రామంతో ఈ రోడ్డుముడిపడి ఉంది. రోడ్డుపై వెళ్తే ప్రయాణికులకు చాలా దూరాన్ని తగ్గించడం సమయం వృధాకాకుండా ఉపయోగంగా ఉంటుంది. గాంధారి మండలం నుంచే కాకుండా వర్ని, బీర్కూర్, బోధన్‌తో పాటు మండలంలోని సీతాయిపల్లి, గండివేట్, మేడిపల్లి,సర్వాపూర్,ముదెళ్లి,మొండి సడక్, గౌరారం గ్రామాలతో పాటు చాలా గ్రామాల ప్రజలు ఇదే రోడ్డు నుంచి ఎల్లారెడ్డి నియోజకవర్గానికి వెళ్తుంటారు. రిజిస్టర్ ఆఫీస్‌తో పాటు డివిజన్ కావడంతో ప్రతీఒక్కరు ఏదో పనిమీద ఎల్లారెడ్డి వెళ్లడానికి ఈరోడ్డె ఉపయోగిస్తారు. ద్విచక్రవాహనం కూడా వెళ్లలేకుండా రోడ్డుగుంతల మయం అయి వర్షానికి కొట్టుకుపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నారు. ప్రభుత్వం మారిన ఈ రోడ్డుకు మాత్రం మరమ్మత్తులు చేయడానికి కూడా ఎవరు పట్టించుకోకపోవడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కోంటున్నారు. ఇప్పటికైన అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేసి బీటీరోడ్డు వేయాలని కోరుతున్నారు.

కంకరవేశారు... బీటీ మరిచారు

గాంధారి మండలంలోని పొతంగల్ కలాన్ స్టేజీ నుంచి చందనాయక్ తండా వరకు గత ప్రభుత్వం అటవీ అధికారులతో పర్మిషన్ తీసుకుని డబుల్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో ఆ పనులు కంకరవేసి వదిలేశారు. అప్పటికే ప్రభుత్వం మారడం సదరు కాంట్రాక్టర్ పట్టించుకోకపోవడంతో ఇప్పటికి ఆ రోడ్డుపై నిత్యం వందలాది వాహనాలు బాన్సువాడ,కామారెడ్డికి వస్తుంటారు. అక్కడికి రాగానే బీటీ రోడ్డు వేయకపోవడంతో ముందు బస్సు, కార్లలో వెళ్తే వెనుక నుంచి వచ్చే ద్విచక్రవాహనదారునికి రోడ్డు కూడా దుమ్ముతో కనిపియకపోవడంతో ప్రమాదాల భారిన పడుతున్నారు. ఇటీవల ఇద్దరు వేర్వేరుగా రోడ్డు ప్రమాదాలకు గురై అక్కడే చనిపోయారు. మండలంలోని ఓ యువకుడు దుమ్ముతో రోడ్డు కనిపించకపోవడంతో అక్కడే రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈ విషయం ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు దృష్టికి తీసుకెళ్లడంతో ఎమ్మెల్యే తక్షణమే బీటీ రోడ్డు వేయించాలని సదరు ఆర్‌అండ్‌బీ అధికారులకు ఆదేశించారు. అయినా సదరు కాంట్రాక్టర్ నేటికీ బీటీ వేయకపోవడంతో నిత్యం ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

- సంజీవ్, గండివేట్

వెల్లుట్ల- ఎల్లారెడ్డి వెళ్తున్న రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేసి రోడ్డు మంజూరు చేయాలి. రోడ్డు గుంతలమయం కావడంతో ద్విచక్ర వాహనంపై కూడా వెళ్ల లేకుండా ఇబ్బంది ఉంటుంది. మరమ్మతులు చేస్తే ఎల్లారెడ్డికి ప్రయాణం తొందరగా అవుతుంది.

రోడ్డును బాగు చేయాలి

- నితిన్, గాంధారి

రోడ్డు చాలా అధ్వానంగా ఉంది. గండివేట్ మీదుగా ఎల్లారెడ్డి వెళ్లే వెల్లుట్ల రోడ్డును బాగు చేస్తే ప్రయాణదూరం తగ్గుతుంది. ఈ రోడ్డుకు మరమ్మతులు చేసి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలి. సంబంధిత శాఖ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలి.



కామారెడ్డి- బాన్సువాడ రోడ్డుపై వేయని బీటీ

ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పెద్ద కొడప్‌గల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్లం ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలకు ఎంపిక అయినట్లు వడ్లం పాఠశాల పీడీ ధర్మేందర్ తెలిపారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఉమ్మడి జిల్లాల ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్ పోటీల్లో వడ్లం పాఠశాలకు చెందిన అర్చన అండర్-14 విభాగం షాట్‌పుట్‌లో ప్రథమస్థానం, కీర్తన అండర్-17 విభాగం హైజంప్‌లో ప్రథమ స్థానం, లాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానం సాధించారని తెలిపారు. వీరు నవంబరు 8 నుంచి 11 వరకు ఖమ్మంలో జరిగే రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పాఠశాల నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు.


ఎల్లారెడ్డి ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఎండ్రియాల్ గ్రామస్థులు

ఎండ్రియల్ పెద్దవాగు వంతెన నిర్మాణానికి ఆమోదం

తాడ్వాయి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న ఎండ్రియాల్ ఎర్రాపహడ్ పెద్దవాగు వంతెన నిర్మాణానికి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆమోదం తెలిపినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. వంతెన నిర్మాణాన్ని త్వరలోనే చేపడుతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎండ్రియాల్ గ్రామ ప్రజలు మదన్ మోహన్‌రావుకి శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తాడ్వాయి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జూకంటి వెంకట్‌రెడ్డి, ఎండ్రియాల్ గ్రామ అధ్యక్షుడు సంజీవ్, సుధాకర్‌రావు, నారాయణరెడ్డి, మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఐఈవో షేక్ సలాం

విద్యార్థులు కష్టపడి చదివితేనే బంగారు భవిష్యత్

పెద్ద కొడప్‌గల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివితేనే భవిష్యత్ బంగారు మయంగా ఉంటుందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి షేక్ సలాం పేర్కొన్నారు. మంగళవారం జుక్కల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను పరిశీలించి పలు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో సలాం మాట్లాడుతూ విద్యార్థులు తాము విద్యను అభ్యసించే సమయంలో కష్టపడి చదివితే భవిష్యత్తు బంగారుమయంగా ఉంటుందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే సాధించలేనిది ఏది ఉండదన్నారు. కళాశాలలో నిర్వహిస్తున్న ఎంసెట్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మోహన్ రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.


స్థలాన్ని పరిశీలిస్తున్న విద్యుత్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు

విద్యుత్ ఉప కేంద్రానికి స్థల పరిశీలన

తాడ్వాయి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిట్యాల గ్రామంలో మంజూరు చేసిన విద్యుత్ ఉప కేంద్రానికి స్థలాన్ని మంగళవారం పరిశీలించినట్లు విద్యుత్ ఎస్ఈ రమేష్ బాబు తెలిపారు. విద్యుత్ ఉప కేంద్రం మంజూరు చేసినందుకు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావుకు ఏడు గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ విద్యుత్ ఉప కేంద్రం ద్వారా ఏడు గ్రామాలకు కరెంట్ కష్టాలు తీరనున్నాయన్నారు. త్వరలో విద్యుత్ ఉప కేంద్రం పనులను ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జూకంటి వెంకటరెడ్డి, ఏఎంసీ వైస్ ప్రెసిడెంట్ జక్కుల రాజిరెడ్డి, యూత్ అధ్యక్షుడు అఖిల్‌రావు, కాంగ్రెస్ నాయకులు సుధాకర్‌రావు, అధికారులు విద్యుత్ డీఈ కళ్యాణ్, చక్రవర్తి, ఏఈ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

3న కామారెడ్డికి మంద కృష్ణమాదిగ రాక

కామారెడ్డి టౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి పట్టణానికి వచ్చే నెల 3న ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ రానున్నట్లు ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి బట్ట వెంకటరాములు తెలిపారు. పట్టణంలోని ఎస్ఆర్‌గార్డెన్‌లో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న సభకు పెద్ద మొత్తంలో హాజరుకావాలని కోరారు.

ఇసాయిపేట సమీపంలో ఒకరి హత్య

మాచారెడ్డి,అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పాల్వంచ మండలం ఇసాయిపేట గ్రామసమీపంలో దువ్వాల కృష్ణ సోమవారం రాత్రి హత్యకు గురయ్యాడు. వివరాలు ఇలా ఉన్నాయి... కామారెడ్డి మండలం ఉగ్రవాయి గ్రామానికి చెందిన దువ్వాల కృష్ణ తండ్రి చిన్నతనంలోనే మరణించడంతో అమ్మగారి ఊరైన మాచారెడ్డి మండల కేంద్రంలో నివాసం ఉంటూ జీవనం సాగిస్తు అదే గ్రామానికి చెందిన జ్యోతిని వివాహం చేసుకున్నాడు. బతుకుదెరువుకోసం ఆటోలో పాలను తరలించడం చేస్తున్నాడు. సోమవారం సాయంత్రం ఆటో తీసుకుని రోజులాగే మాచారెడ్డి నుంచి అక్కపూర్,అన్నారం గ్రామాలలో పాలన తీసుకుని ఇసాయిపేటకు చేరుకునే సమయంలో మాచారెడ్డి గ్రామానికి చెందిన నామాల వినయ్ మరోఇద్దరితో కలిసి ఇంకో వాహనంలో బయలుదేరి కృష్ణతో ఘర్షణ పడ్డారు. ఈ క్రమంలో కృష్ణను హత్యచేసి ఓ చెట్టుకు ఉరివేసి ఆత్మహత్యగా చిత్రికరించే ప్రయత్నంచేశారు. పెనుగులాటలో కృష్ణపై ఉన్న టవాల్ హత్యకు ఉపయోగించిన గ్లౌజు,చెప్పులు అక్కడే పడి ఉన్నాయి. మృతుని చొక్కా చినిగిపోయిఉంది. అయితే నామాల వినయ్ మృతుని భార్య జ్యోతితో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు.దీంతో అక్రమ సంబంధంకు అడ్డుగా ఉన్నాడని కృష్ణను హత్యచేయాలని పథకం వేవారు. మృతుడు కృష్ణ హత్యచేసిన నామాల వినయ్‌కి సొంత మేనబావ అవుతాడు. మృతుని భార్య వరుసకు చెల్లె అవుతుంది అయిన వినయ్ ఆమెతో అక్రమసంబంధం కొనసాగించడం పట్ల సభ్యసమాజం సిగ్గుపడేలా ఉందని స్థానికులు చర్చించుకుంటున్నారు. హత్య విషయం తెలుసుకున్న మాచారెడ్డి ఎస్ఐ అనిల్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అక్కడ ఉన్న ఆనవాళ్లను చూసి పోలీసులకు అనుమానం వచ్చి భార్య జ్యోతిని అదుపులోకి తీసుకుని విచారించి నామాల వినయ్‌తో పాటు దిలావర్‌తౌలిఫ్‌లను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. దీనిపై ఎస్ఐ వివరణ కోరగా బుధవారంప్రెస్‌మీట్ పెట్టి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.


కృష్ణ(ఫైల్)
హత్యజరిగిన ప్రాంతంలో పోలీసులు గుర్తించిన చెప్పులు,గ్లౌజు,టవాల్

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థి ఎంపిక

రామారెడ్డి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి మండలం పోసానిపేట ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సుస్వాంత్‌రెడ్డి 68వ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ అండర్‌జూనియర్ విభాగంలో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో సుస్వాంత్‌రెడ్డి ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. నవంబర్ 7వ తేదిన యాదాద్రి భువనగిరి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో క్రీడా విద్యార్థి పాల్గొంటారని పీడీ తెలిపారు.

ప్రజా శ్రేయస్సు కోసం పని చేసేది కాంగ్రెస్ ప్రభుత్వమే

పెద్ద కొడప్‌గల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో ప్రజా శ్రేయస్సు కోసం పనిచేసేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతా రావ్ పేర్కొన్నారు. మంగళవారం జుక్కల్ క్యాంపు కార్యాలయంలో సిఎంఆర్ఎఫ్ కింద మంజూరైన చెక్కులను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా తోట మాట్లాడుతూ..అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందని తెలిపారు. జుక్కల్ నియోజక వర్గంలోని నిజాంసాగర్, పిట్లం, పెద్ద కొడప్‌గల్, మహమ్మద్‌నగర్,జుక్కల్, బిచ్కుంద, డోంగ్లి, మద్నూర్ మండలాలకు చెందిన 160 మందికి చెక్కులు పంపిణీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చేస్తున్న ఆసుపత్రులను సీజ్‌చేయాలి

కామారెడ్డిటౌన్,అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో లింగనిర్ధారణ చేస్తున్న ఆసుపత్రులను సీజ్‌చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్‌కు వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని సమన్విత ఆసుపత్రితో పాటు చట్టవిరుద్ధంగా పరీక్షలు నిర్వహిస్తున్నాఆసుపత్రులను వెంటనే మూసివేయాలని లేదంటే తామే దాడులు నిర్వహించి మూసివేయిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట్‌గౌడ్, మోతి రాంనాయక్, కొత్తనర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

కామారెడ్డిటౌన్,అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): స్కాలర్‌షిప్, ఫీజురియింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తు ఏబీవీపీ నాయకులు మంగళవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 7800 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజురియింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులురోహిత్,ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగంలో చేరిన కొద్ది రోజులకే ప్రభుత్వ ఉపాధ్యాయుడి మృతి


యాదగిరి (ఫైల్)

నాగిరెడ్డిపేట,అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాసానిపల్లి గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు వరిగే యాదగిరి ఉద్యోగంలో చేరిన కొద్ది రోజులకే అనారోగ్యం కారణంగా సోమవారం రాత్రి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మాసానిపల్లి గ్రామానికి చెందిన వరిగే నర్సింలు కుమారుడు వరిగే యాదగిరి బాగా కష్టపడి చదివే వాడని, చదువులో బాగా రాణించి ఇటీవల వెలువడిన రెండు ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించినట్లు ఉద్యోగాలు సాధించిన కొన్ని నెలల వ్యవధిలోనే ఆయన మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. యాదగిరి గత నాలుగు నెలలు క్రితం వెలువడిన గురుకుల పాఠశాల ఫలితాల్లో ఉద్యోగం సాధించినట్లు, లింగంపేట మహాత్మా గాంధీ జ్యోతి బాపూలే పాఠశాలలో విధులు నిర్వహించినట్లు తెలిపారు. ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో గణిత విభాగంలో జిల్లాలో మొదటి ర్యాంకు సాధించినట్లు, లింగంపేట బాలుర ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయునిగా చేరినట్లు అనారోగ్యం కారణంగా సోమవారం రాత్రి ఆయన మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

అదనపు కలెక్టర్‌గా వి.విక్టర్ బాధ్యతల స్వీకరణ

కామారెడ్డిటౌన్,అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి):కామారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) వి.విక్టర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్, అదనపు కలెక్టర్(స్థానికసంస్థల) డి.శ్రీనివాస్‌రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలను అందించారు.

అన్యాయం ఎప్పటికీ గెలవదు.. న్యాయమే గెలుస్తుంది

● మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్

భిక్కనూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): అన్యాయం ఎప్పటికీ గెలవదని ఎన్నటికైనా న్యాయమే గెలుస్తుందని మాజీఎమ్మెల్యే గంపగోవర్ధన్ అన్నారు. మంగళవారం మండలంలోని బస్వాపూర్ విండో చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన మద్ది స్వామి మాజీ ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈమేరకు మద్ది స్వామిని మాజీ ఎమ్మెల్యే శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విండో అభివృద్ధికి తన పూర్తి సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో విండో డైరెక్టర్లు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సామాజిక తనిఖీ

లింగంపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : లింగంపేట మండల పరిషత్తు కార్యాలయం వద్ద మంగళవారం ఉపాధి హామీ పనులకు సంబంధించినమండల సామాజిక తనిఖీ సాదాసీదాగా జరిగింది. మండలంలోని 41గ్రామ పంచాయితీలలో మొత్తం రూ.3కోట 52లక్షల66వేల361 విలువ గల పనులను చేసినట్లు వివరించారు. మండలంలోని ఆయా గ్రామాలలో సామాజిక తనిఖీ బృందం వారం రోజులుగా కూలీల ఇంటికి వెళ్లి చేసిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పనుల వివరాలను మండల సభలో చదివి వినిపించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీఏ వామన్‌రావు, సామాజిక తనిఖీ అధికారులు ప్రశాంత్, విప్లవకుమార్, శ్రీనివాస్, ఎస్ఆర్‌పీలు మహేశ్వర్, ఎంపీడీవో నరేష్, ఎంపీవో మలహరి, ఏపీవో శ్రీనివాస్‌లు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

భిక్కనూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలంలోని 44వ జాతీయరహదారిపై టోల్‌ప్లాజా వద్ద మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్లితే హైదరాబాద్ నుండి నిజామాబాద్ వైపు వెళ్తున్న డీసీఎం వ్యాను టోల్‌ప్లాజా వద్ద అదేవైపు ముందు వెళ్తున్న లారీ వేగంగా ఢీకొనడంతో డీసీఎం ముందు బాగం ధ్వంసమై డీసీఎం డ్రైవర్ తీవ్రగాయాలతో ఇరుక్కోనిపోయాడు. ఈ విషయం తెలుసుకున్న భిక్కనూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని జీఎంఆర్, టోల్ సిబ్బంది సహాయంతో డ్రైవర్‌ను బయటకు తీసి జీఎంఆర్ అంబులెన్స్‌లో కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

ఇంటర్ యూనివర్సిటీ సౌత్‌జోన్ కబడ్డీ పోటీలకు బస్వాపూర్ యువకుడు ఎంపిక

భిక్కనూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన పర్స సందీప్ ఇంటర్ యూనివర్సిటీ సౌత్ జోన్ కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 27న టీయూలో జరిగిన సెలక్షన్‌లో సందీప్ మంచి ప్రతిభ కనబరిచి సౌత్‌జోన్ పోటీలకు ఎంపిక య్యాడని గ్రామస్తులు తెలిపారు. సౌత్‌జోన్‌కు ఎంపికైనా సందీప్‌ను గ్రామస్థులు అభినందించారు.

తాడ్వాయి ఏపీఎం బదిలీ

తాడ్వాయి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో పని చేస్తున్న ఏపీఎం బదిలీపై మద్నూర్ వెళ్లినట్లు అధికారులు తెలిపారు. మద్నూర్‌లో పని చేస్తున్న మనోహర్ బదిలీపై తాడ్వాయి మండలానికి వచ్చారు.

విత్తన ఉత్పత్తిలో సొసైటీలకు భాగస్వామ్యం కల్పించే విధంగా చూడాలి

సదాశివనగర్,అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి):విత్తన ఉత్పత్తిలో సొసైటీలకు భాగస్వామ్యం కల్పించేవిధంగా చూడాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డినిఅడ్లూర్‌ఎల్లారెడ్డి సింగిల్‌విండో చైర్మన్ మర్రిసదాశివరెడ్డి అన్నారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ అన్వేష్‌రెడ్డిని మర్యదపూర్వకంగా కలిసి సహకార సంఘాల కార్యక్రమాలను వివరించారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రవిత్తన ఉత్పత్తిలో సొసైటీలకు భాగస్వామ్యం కల్పించేవిధంగా కార్యక్రమాలను రూపొందిస్తున్న క్రమంలో సహకార సంఘాలకు మరింత మేలు చేసినట్లు అవుతుందన్నారు. సంస్థ ఎండీ ఉదయ్‌కుమార్ హాజరై విత్తన ఉత్పత్తిలో మార్కెటింగ్‌లో సొసైటీల భాగస్వామ్యాన్ని పెంచడానికి అభిప్రాయ సేకరణ చేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా డీసీఓ, వివిధ జిల్లాల డీసీఓలు, సొసైటి చైర్మన్‌లు,సీఈవోలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలంటూ ఎమ్మెల్యేకు వినతి

పెద్ద కొడప్‌గల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పునిచ్చిన నేపథ్యంలో వర్గీకరణ అంశం తొందరగా ప్రారంభం చేయాలంటూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యే తోట లక్ష్మికాంతారావ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు రూసేగాం భూమయ్య మాట్లాడుతు ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం తొందరగా నిర్ణయం తీసుకుని వర్గీకరణ చేయాలని, లేదంటే మాదిగలకు అన్యాయం జరుగుతుందని తెలిపారు.గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో పెట్టిన విధంగా అర్హులైన వారికి దళితబందు లాగా అంబేద్కర్ అభయ హస్తం కింద రూ.12 లక్షల ఇస్తామని ప్రకటించిన నేపథ్యంలో అర్హులైన వారికి అంబేద్కర్ అభయ హస్తం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జుక్కల్, పెద్ద కొడప్‌గల్, మద్నూర్ మండలాల అధ్యక్షుడు అయిల్‌వార్ మారుతి, సర్వగల్ల రవీందర్, శంకర్, ఎమ్మార్పీఎస్ నాయకులు సురేష్ పాల్గొన్నారు.

సోయా దళారుల పాలు

(5వ పేజీ తరువాయి)

రైతులు పత్తి, మొక్కజొన్న నుంచి సోయా పంట వైపు మొగ్గ చూపారు. దీంతో 94 వేల ఎకరాల్లో సోయాపంట సాగైంది. కాలం మంచిగా కావడంతో సోయా పంటసైతం బాగానే ఉందని ఎకరాన 7 నుంచి 8 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తున్నాయని రైతులతో పాటు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. అయితే ప్రభుత్వ నిబంధనల ప్రకారం మార్క్‌ఫెడ్ ఎకరాన 6 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేయాలని మొదట నిర్ణయించింది. దీంతో జిల్లా వ్యాప్తంగా 12వేల మెట్రిక్ టన్నులు మాత్రమే మార్క్‌ఫెడ్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.అయితే ఇటీవల సోయా కొనుగోలులో పరిమితిని సడలిస్తు ప్రభుత్వం ఆదేశించింది. ఎకరాన 8 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేయాలని నిర్ణయించింది. అయితే కేంద్రాల్లో మాత్రం అమలుకావడం లేదు.ప్రభుత్వ మద్దతు ధరక్వింటాల్‌కు రూ.4,892 ఉంది.మార్క్‌ఫెడ్ ఏర్పాటు చేసిన కేంద్రాల్లో విక్రయిస్తేనే ఈ మద్దతు ధర లభించనుంది. అయితే కేంద్రాల్లో మా శ్చర్, పరిమితి కొనుగోలు, నాణ్యమైన పంట కొనుగోలు చేస్తేనే ఈ మద్దతు ధర లభించనుంది.నిబంధనలను సడలించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించండి

సదాశివనగర్,అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి):కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలంలోని ఆయా గ్రామాలలో వరి కొనుగోలు ప్రారంభించాలని బీఆర్ఎస్ సీనియర్‌నాయకుడు మాజీ జడ్పీటీసీ పడిగెల రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో రైతులు స్థానిక తహసీల్దార్‌కు మంగళవారం వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ ప్రదానకార్యదర్శి నర్సారెడ్డి, ఎల్లాగౌడ్,లచ్చిరాంనాయక్, మల్లయ్య,కిషన్‌రావు,బండరాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

నిజాంసాగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధతో ప్రభుత్వం పని చేస్తుందని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలోని మహ్మద్‌నగర్‌కు చెందిన నర్ర సోమయ్యకు సీఎంఆర్ఎఫ్ చెక్కునుపంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, మండల యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లయ్య, ఆకాష్, గ్రామ అధ్యక్షుడు తోట రాజు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్యా యత్నం

ఎల్లారెడ్డి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఓ వ్యక్తి బాధపడుతూ క్రిమి సంహారక మందు తాగి మృతి చెందిన సంఘటన ఎల్లారెడ్డిలో చోటు చేసుకుంది. ఎల్లారెడ్డి ఎస్సై బొజ్జ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అడవి లింగాల గ్రామానికి చెందిన పోలీసు శ్రీనివాస్ (43) గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఉండేవాడని ఈనెల 24న శ్రీనివాస్ భార్య పొలం పనులను వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని మందుతాగి ఆత్మహత్యకు ప్రయత్నించగా తిరిగి ఇంటికి విచ్చనా భార్య గమనించి చుట్టూ పక్కల వారికి సమాచారం ఇచ్చిఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసు పత్రికి తరలించగా ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కొరకు ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య సునీతా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి		బాన్సువాడ	
శాంతి	దేవర	మహేశ్వరి	వేట్టయన్ (ది హంటర్)
దర్శన్	ద లాస్ట్ డ్యాన్స్ పొట్టేల్	వెంకటేశ్వర	పొట్టేల్
ప్రియా 35	విశ్వం		
ప్రియా 70	లగ్గం		

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	160	200	220
వెన్‌కాబ్(కిలో)	130	160	190